నమస్తే తెలంగాణ
# కరీంనగర్
3 | కరీంనగర్, శనివారం 4 జనవరి 2025 | KARIMNAGAR

## నేడు సిరిసిల్లకు కేటీఆర్



రాజన్న సిరిసిల్ల, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరి 11 గంటలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌కు చేరుకుంటారు. సాయంత్రం వరకు పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బీసీ యువజన సంఘం ధర్నా

కరీంనగర్ తెలంగాణ చౌక్, జనవరి 3 : పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకొని పోయేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ₹5 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్నికలకు ముందు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఎదుట ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల ఇండ్ల ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు నితిన్, శ్రీనివాస్, బాలకృష్ణ, గంగాభవాని పాల్గొన్నారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

## పంచాయతీలకు ఆగిన గ్రాంట్లు..

# కార్యదర్శులు అప్పులపాలు!







- పన్నెండు నెలలుగా నిలిచిన నిధులు
- ఎన్నికలు లేక ఆగిన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు
- స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ది అదే బాట
- చిన్నచూపు చూస్తున్న రేవంత్ సర్కారు
- ఆదేశాలు ఇచ్చేవారే తప్ప ఆర్థికంగా సహకరించేవారు కరువు?
- తమ బాధ్యత లేదన్నట్టుగా కలెక్టర్లు, ప్రత్యేకాధికారులు!
- సొంతంగా జేబుల నుంచి రోజువారీ ఖర్చులు పెడుతున్న సెక్రటరీలు
- ప్రతి జీపీలో నెలకు ₹10వేలకుపైనే ఖర్చు
- ఉమ్మడి జిల్లాలో ఓ అంచనా ప్రకారం ₹13 కోట్లకుపైగా..
- జూలై నుంచి ట్రెజరీల్లో ఆగిన చెక్కులు
- నిధులు లేక.. పెట్టిన డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందులు




**కాంగ్రెస్ పాలనలో పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. పన్నెండు నెలలుగా గ్రాంట్లు రాకపోవడంతో జీపీలు ఆర్థికంగా చతికిల పడ్డాయి. రోజువారీ పనులకు కూడా పైసా లేక కార్యదర్శులే సొంతంగా జేబుల నుంచి ఖర్చులు పెడుతున్నారు. అసోసియేషన్ నుంచి వస్తున్న సమాచారం చూస్తే.. గడిచిన పన్నెండు నెలల్లో దాదాపు ₹13 కోట్లకుపైగా డబ్బులను జేబుల నుంచి ఖర్చు పెట్టుకున్నారు. పెట్టిన పైసలు రాక, ట్రెజరీలకు ఇచ్చిన చెక్కులకు మోక్షం లేక, రోజు వారీ పనులు ఆపలేక అప్పులపాలవుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. పై నుంచి ఆదేశాలు ఇచ్చే వారే తప్ప ఆర్థిక వనరులను సమకూర్చడంలో అటు రాష్ట్ర ప్రభుత్వం గానీ, ఇటు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు గానీ పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. పంచాయతీలే కాదు, తామూ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పేరిట కనీస సెలవులు ఇవ్వకుండా పనిచేయిస్తున్న తీరుపై కార్యదర్శుల కుటుంబాల్లోనూ ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇప్పట్లో ఈ బాధలకు విముక్తి కలుగుతుందా.. లేదా..? అన్న ఆవేదన కనిపిస్తున్నది.**

### ఆర్థిక పరమైన ఇబ్బందులు లేకుండా చూడాలి

పంచాయతీల్లో నెలకొన్న పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేయాలి. కనీసం రోజువారీ నిర్వహణ కోసం ప్రతినెలా పంచాయతీలకు నిధులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకపోతే కార్యదర్శులు ఆర్థికంగా ఇంకా చితికిపోయే ప్రమాదం ఉన్నది. ఇప్పటివరకు సొంతంగా జేబుల నుంచి పెట్టిన డబ్బులు ఇప్పించాలని అధికారులను, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.



ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తాం. వాటి ప్రకారం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. అయితే పండుగ, సెలవు రోజుల్లో తమను విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఎందుకంటే నిరంతర డ్యూటీతో కుటుంబానికి కనీస సమయం ఇవ్వలేని పరిస్థితి ఉన్నది. గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ 31వరకు మేం నిర్వహించిన విధులే దీనికి నిదర్శనం. దీంతో మా కార్యదర్శుల కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయి. దయ చేసి మా సమస్యను అర్థం చేసుకొని ఆర్థిక ఇబ్బందులను తొలగించాలి. సెలవు రోజుల్లో అన్ని శాఖల ఉద్యోగుల మాదిరిగానే మాకు విధుల నిర్వహణ లేకుండా చూడాలి.

**- జీ అజయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు**

కరీంనగర్, జనవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్రం ఆర్థిక సంఘం ద్వారా నిధులు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నేరుగా విడుదల చేస్తున్నది. 2011 జనాభా ప్రాతిపదికన ప్రతినెలా చిన్న చిన్న పంచాయతీలకు నెలకు ₹50వేలు, మధ్య రకం పంచాయతీలకు ₹5 లక్షల నుంచి ₹10 లక్షలు, మేజర్ పంచాయతీలకు ₹15లక్షల నుంచి ₹25లక్షల వరకు నిధులు వస్తాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నెలనెలా పల్లెప్రగతి కింద నిధులు జమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా పల్లె ప్రగతికి ప్రత్యేక గ్రాంటు మంజూరు చేయడంతో జీపీలు కళకళలాడాయి. కానీ, కాంగ్రెస్ పాలనలో గతేడాది జనవరి నుంచి నిధుల మంజూరు దాదాపుగా నిలిచిపోయింది. ఆగస్టు-సెప్టెంబర్‌లో రాష్ట్ర సర్కారు జీపీలకు ఒక నెలలో ఇచ్చే గ్రాంటు విలువలో కేవలం 25 నుంచి 40 శాతం నిధులను ఇచ్చి మమ అనిపించింది. దీంతో పంచాయతీలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. కేంద్రం నిధులు నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలే అధికంగా ఉన్నాయి. 2019 జనవరి 21, 25, 30 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు వివిధ దశల్లో జరుగగా.. 2024 ఫిబ్రవరి ఒకటితో పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనను అమల్లోకి తెచ్చింది. నిబంధనల ప్రకారం సర్పంచుల పదవీకాలం ముగిసిన ఆరు నెలల్లోగా ఎన్నికలు జరగాలి. కానీ. ప్రస్తుత పరిస్థితిని చూస్తే పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఉన్నది. ఎన్నికలు నిర్వహించక పోవడంతో కేంద్రం ఆర్థిక సంఘం గ్రాంటును నిలిపివేసింది. ఇదే సమయంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి కూడా నిధులు రావడం లేదు.

### నిలిచిపోయిన చెక్కులు

నిధులు నిలిచిపోయినా పంచాయతీల్లో రోజువారీ పనులు నిర్వహించకపోతే పాలన స్తంభించిపోయే ప్రమాదమున్నది. అంతేకాదు, పారిశుధ్యం, తాగునీరు వంటివి ఆగిపోతే పల్లెలు రోగాల పాలయ్యే ముప్పు ఉన్నది. ప్రజారోగ్యం దృష్ట్యా సాధారణంగా మైనర్ పంచాయతీల నిర్వహణకు నెలకు సుమారు ₹20వేల నుంచి ₹25వేలు, మేజర్ పంచాయతీలకు ₹1.50లక్షల నుంచి ₹2 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. గతంలో గ్రాంట్స్ రావడంతో ఏ ఇబ్బంది లేకుండా పాలన సాగింది. కానీ, ప్రస్తుతం రోజువారీ ఖర్చులకు కూడా ప్రభుత్వం పైసా ఇవ్వడం లేదు. కాగా, జీపీల పరిధిలో ఇంటి బిల్లులు, మార్కెట్‌తోపాటు పెనాల్టీలు.. ఇలా వివిధ రూపాల్లో సమకూరే ఆదాయాన్ని జనరల్ ఫండ్ కింద కార్యదర్శులు ట్రెజరీలో జమ చేస్తారు. ఈ డబ్బులను కూడా వినియోగించే అవకాశం లేకుండా పోతున్నది. నిజానికి ఏప్రిల్ నుంచి చెక్‌లు పాస్ చేయడం నిలిపివేశారు. సెక్రటరీల ఒత్తిడి మేరకు తాజాగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉన్న బిల్లులను పాస్ చేశారు. గత ఆగస్టు నుంచి మాత్రం బిల్లులు పెడింగ్‌లోనే ఉన్నాయి. దీంతో చిన్న స్థాయి బిల్లు కూడా తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. సిబ్బంది వేతనాలకు మాత్రం అనుమతి ఇస్తున్న ట్రెటరీ అధికారులు, ఇతర బిల్లులను పక్కన పెడుతున్నారు.

### జేబుల నుంచి ఖర్చులు

ఏడాది కాలంగా 99 శాతం పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఈ పరిస్థితులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా.. నయాపైసా ఇవ్వకుండా గతేడాది 'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయాలంటూ కార్యదర్శుల మెడపై కత్తి పెట్టి పనులు చేయించింది. అలాగే 12 నెలలుగా జీపీలకు అవసరమైన ఫాగింగ్, బ్లీచింగ్, పారిశుధ్యం, తాగునీరు, స్ట్రీట్‌లైట్స్, బోర్ల రిపేరు, ట్రాక్టర్లకు డీజిల్ లాంటి పనుల కోసం సెక్రటరీలే తమ జేబు నుంచి ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలా ఒక్కో కార్యదర్శి తన పంచాయతీ కోసం ప్రతి నెలా తన జేబు నుంచి ₹10వేల నుంచి ₹20వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అయితే పెట్టిన బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియకపోగా.. ఖర్చు పెట్టకపోతే ముందుకెళ్లలేని స్థితి ఉన్నది. ఉమ్మడి జిల్లాలో పంచాయతీల నిర్వహణకు జేబుల నుంచి ఖర్చు పెట్టని ఏ ఒక్క కార్యదర్శి ప్రస్తుతం లేడని సెక్రటరీలే చెబుతున్నారు. రోజు వారీ పనులు చేయకపోతే సస్పెండ్ చేస్తామని ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఆదేశాలతో కొంత మంది క్రెడిట్ కార్డులు వాడుతున్నారని, మరికొంత మంది అప్పులు తెచ్చి పెడుతున్నారని వాపోతున్నారు. ప్రధానంగా మహిళా సెక్రటరీలు డబ్బులు సర్దుబాటు చేయలేక, చేసిన అప్పులకు కుటుంబానికి సమాధానం చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రత్యేకాధికారులు పైసా విదిల్చకపోగా, పలు రకాల ఆదేశాలు ఇస్తూ అజామాయిషీ పెంచుతున్నట్టు తెలుస్తున్నది. తమ ఇబ్బందులను పరిష్కరించి, ఆర్థికంగా తమకు వెసలుబాటు కల్పించాలని అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లను కలిసి విన్నవించుకున్నా పట్టించుకునే వారు లేరన్న ఆవేదన వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించి, తాము వెచ్చించిన డబ్బులు తమకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు కూడా తమనే వాడుతున్నారని, పైగా తర్వాత పూర్తిచేయాలని ఒత్తిడి తెస్తున్నారని వాపోతున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ 31వరకు ఆదివారాలు, పండుగలు అని చూడకుండా.. సెలవులు ఇవ్వకుండా సెక్రటరీలతో పనిచేయించడంపై వారి కుటుంబాల్లో ఆవేదన వ్యక్తమవుతున్నది.

**ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు.. 12 నెలలుగా గ్రాంటు రాకపోవడంతో ఒక అంచనా ప్రకారం సెక్రటరీలు తమ జేబు నుంచి పెట్టిన ఖర్చుల వివరాలు**

| జిల్లా | పంచాయతీలు | వార్డులు | ఒక అంచనా ప్రకారం సెక్రటరీలు పెట్టిన ఖర్చులు (₹కోట్లలో) |
|---|---|---|---|
| జగిత్యాల | 383 | 3,500 | 4.21 కోట్లు |
| పెద్దపల్లి | 263 | 2,474 | 2.89 కోట్లు |
| కరీంనగర్ | 313 | 2,966 | 3.44 కోట్లు |
| రాజన్న సిరిసిల్ల | 255 | 2,240 | 2.80 కోట్లు |

## చైనా మాంజాతో ప్రమాదం

- విక్రయిస్తే కఠిన చర్యలు : జగిత్యాల ఎస్పీ



జగిత్యాల కలెక్టరేట్, జనవరి 3 : నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఈ మాంజాతో మనుషులు, పక్షులకు ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. దీనిపై అందరికీ అవగాహన ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం చైనా మాంజా వినియోగం నిషేధించారని తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలు పక్షులు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని వివరించారు. చైనా మాంజా విక్రయాల నిరోధానికి, మాంజా వినియోగాన్ని నిలిపివేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా ఈ మాంజా విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ఉపాధి లేకుండా చేయొద్దు

- ఎన్టీపీసీ తీరుపై గీత కార్మికుల ఆందోళన
- వంటావార్పుతో నిరసన
- మద్దతు తెలిపిన జడ్పీ మాజీచైర్మన్



నినదిస్తున్న గీత కార్మికుల కుటుంబాలు

పాలకుర్తి, జనవరి 3 : ఈత వనం నరికివేసి తమకు ఉపాధి లేకుండా చేయొద్దని పాలకుర్తి మండలం రాణాపూర్, కన్నాల, లక్ష్మీపురం గ్రామాల్లోని గీత కార్మికులు వేడుకున్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం తీరుకు నిరసనగా శుక్రవారం 300 మంది గీత కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎన్టీపీసీ రిజర్వాయర్ వద్ద వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి గీతవృత్తితో కుటుంబాలను పోషించుకుంటున్న తమకు ఎన్టీపీసీ యాజమాన్యం నష్టం చేకూరుస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రిజర్వాయర్‌పై ఉన్న ఈతవనం నరికివేయడాన్ని నిరసిస్తూ ఇప్పటికే పలుసార్లు కలెక్టర్‌ను, ఎన్టీపీసీ యజమాన్యాన్ని కలిసి విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు దరఖాస్తు చేస్తే మూడురోజుల్లో పరిష్కరిస్తామని ఇంతవరకు రావడం లేదన్నారు. యాజమాన్యం స్పందించకపోతే రాజీవ్ రహదారిని, ఎన్టీపీసీని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మద్దతు తెలిపారు. నిరసనలో రైతు సంఘం అధ్యక్షుడు మూడిమడుగుల మల్లన్న, కార్యదర్శి ఎరుకల రాజన్న, నాయకులు రవిగౌడ్, బాలసాని స్వామిగౌడ్, నాగభూషణం, జాగిరి అంజన్‌కుమార్‌గౌడ్, బాలగోని కుమార్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు సూర సమ్మయ్య, ఆడెపు శ్రీనివాస్, బాలసాని కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సక్రమంగా కరెంట్ లేక ఎండుతున్న మడి

## కరెంటు రాదు.. పొలం పారదు.. నాటేయరు!

కరెంటోళ్ల పుణ్యమా.. అని రైతులు నాటేసేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం యాసంగి నాట్లు ఊపందుకున్న తరుణంలో పొలం దున్నేందుకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌కు చెందిన పూరెల్లి అంజయ్య తన నాలుగెకరాల పొలం వేసేందుకు 25 మంది బిహార్ కూలీలను ఒక్కొక్కరికి ₹500 చొప్పున మాట్లాడుకున్నాడు. నాటేసే ముందు పొలం దున్నడానికి నీళ్లు పెట్టాల్సి ఉండగా, శుక్రవారం తెల్లవారుజామున నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు లేకపోవడంతో ఇబ్బంది పడ్డాడు. పొలంలో నీళ్లు లేకపోవడంతో దున్నడం ఆగిపోగా, నాటు వేయాల్సిన కూలీలు ఇలా ఖాళీగా ఉండాల్సి వచ్చింది. 12 గంటల తర్వాత కరెంటు వచ్చినా నీళ్లు పెట్టి, దున్నేసరికి సాయంత్రం కావడంతో నాటు వేయడం వీలు కాలేదు. ఫలితంగా రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఇలా గ్రామాల్లో చాలా మంది రైతులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

**-కరీంనగర్‌రూరల్, జనవరి 3**



మొగ్దుంపూర్‌లో కరెంట్ కోసం నిరీక్షిస్తున్న దినసరి వ్యవసాయ కూలీలు

## కాంగ్రెస్ పూటకో అబద్ధం

- ఆరు గ్యారెంటీలు అమలయ్యేదాకా వదిలేది లేదు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- దరఖాస్తు లేకుండానే భరోసా ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 3 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మీద పూటకో అబద్ధం ఆడుతున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకూ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వందేళ్ల అభివృద్ధి జరిగితే కాంగ్రెస్ ఏడాది పాలనలోనే పదేళ్లు వెనక్కి పోయిందని విమర్శించారు. ఇది పూర్తిగా తుగ్లక్ పాలనగానే ఉందని ధ్వజమెత్తారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ రైతుబంధు ఇస్తే మూడు పంటలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతులకు ఏడాది కాలంగా రైతుభరోసా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కనీసం రెండు పంటలకు కూడా భరోసా ఇవ్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. ఒక్కో రైతుకు ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ₹20వేలకుపైగా బాకీ పడిందని విమర్శించారు. కౌలు రైతులకు, ఉపాధి కార్మికులకు ఏడాదికి ₹12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు భరోసాకు దరఖాస్తులు తీసుకుంటామని చెప్పడం సరికాదన్నారు. సాగు చేస్తున్న వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని, రైతుల నుంచి మళ్లీ దరఖాస్తులు ఎందుకని మండిపడ్డారు. సంక్రాంతికి ఇస్తామన్న రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని, మరోసారి వాయిదా వేయాలనుకునే ప్రయత్నాన్ని మానుకోవాలని హితవుపలికారు. ఇప్పటికీ రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. కాంట్రాక్టు మంత్రుల జేబులు నింపుకోవడం తప్ప ప్రజా సమస్యలు, సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. అణిచివేత, అరెస్టులు తప్ప కాంగ్రెస్ సాధించిందేమీలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, చొప్పదండి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## 9న తెలంగాణతల్లి విగ్రహానికి భూమిపూజ

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా కార్యక్రమం
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి జనవరి 3 : సెంటినరీకాలనీలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 9న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం ఉంటుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి రామగిరి మండలం పన్నూర్‌లోని సాయిరాం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భూమిపూజ చేస్తారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.